# నాగరాజు

రాయసము వేంకటశివుఁడు గారు, ఎమ్. ఏ. ఎల్. టి.

మనదేశములో సర్పముల స్వభావాదులను గుఱించి జనులు సంపాదించిన జ్ఞానము శాస్త్రరూపకముగ మాత్రము గాక, పురాణగాథలుగాను, మంత్రములుగాను, ఐతిహ్యములుగాను, తరతరములనుండి వచ్చుచున్నది. నాకుఁ దెలిసిన యిట్టివృత్తాంత మొకటి యిచట వివరించుచున్నాను. పాఠకు లిందలి సత్యము నరయుదురు గాక!

ఆంధ్రదేశమున నొకగ్రామమున సర్పపురివారను నింటిపేరుగల బ్రాహ్మణకుటుంబ మొకటి గలదు. ఇన్నూఱుసంవత్సరములకుఁ బూర్వము, సర్పపురివారి పూర్వీకులలో నొక స్త్రీగర్భమున నాగుఁబాము పుట్టెను. దానికి నాగరాజను పేరు పెట్టి, ఆయిల్లాలు సహజానురాగముతో దానిని బాలుపోసి పెంచెను. ఆమె గర్భముననే జనించిన తక్కిన పిల్లలతో ఈచిలువకందు కలసి మెలసి యాడుకొనుచుండును. దినదినాభివృద్ధిగాంచుచున్న యాపాము జనని పోయుపాలతోఁ దనివిఁ జెందక, తన జాతికి నైసర్గికమగుమాంసాహారమునకై తిరుగుచు, కప్పలు మొదలగు చిన్నజంతువులను వేఁటాడుచువచ్చెను. అంతకంతకుఁ బెద్దదియై యాపాము, తన మానవసోదరులతో నెల్లప్పుడు నింకఁ గలసియుండుట కర్తవ్యముగాదని గ్రహించి, నిర్జనప్రదేశ మొకటి చూచుకొనఁ బ్రయత్నించెను. కాని, కన్నతల్లిని, తండ్రిని, నిజసోదరులను విడిచి పోవుట దానికి దుస్సహముగఁ దోఁచి, ఆ యింటనే మెత్తగు కప్పుదగ్గఱను, వెలిసెలలోను, అటకమీఁదను, తన నివాస మేర్పఱచుకొనెను. వెనుకటివలె నిపుడు నాగరాజు ఎల్లప్పుడును తమతోఁ గలసిమెలసి యుండకపోయినను, ఇంట నెచటనో యున్నాఁడు గదా యని జననీజనకులు, సోదరులును, మనస్సును సమాధానపఱచుకొని యుండిరి. అటక మీఁదఁ బాము సంచారము చేయునపుడు, దాని పొడగాంచి క్రిందనుండి పిల్లలు, "అదుగో నాగన్నయ్య!" అని సంతోషముతోఁ జప్పటులు గొట్టఁగా, నాగరాజు, దుముకుచు, మఱుఁగుపడుచు, తిరిగి కనులకగపడుచు, దన యానందము వారికిఁ దెలుపుచుండును. రాత్రి యందఱు నిద్రించుతఱి, నాగరాజు మెల్లఁగఁ గ్రిందికి దిగి వచ్చి, పాలదాలిలోఁ బండుకొని హాయిగ నిదురించి, వేకువనె లేచి పైకెక్కిపోవుచుండును.

ఇట్లు కొంతకాలము గడచిపోయెను. ఇపుడు నాగరాజు, ఈడునకుఁ దగిన యాకారము దాల్చి యుండెను. తన కిష్టమువచ్చినపుడాతఁడు పగలు క్రిందికి దిగి వచ్చి జననీజనకులయొద్దను, అన్నదమ్ముల సమ్ముఖమునను మసలుచు, వారిచ్చుపాలు గ్రోలుచు, వారితోఁ జెరలాటము లాడుచుండును: అంతి

యొకాని, వారియెడ నించుకయైన ద్వేషబుద్ధి వహింపఁడు. ఏమఱుపాటుననైన నెవనిని భయపెట్టఁడు. కఱవఁడు.

గృహయజమానుని పెద్ద కుమారుని కిపుడు యౌవనము రాఁగా, వాని వివాహము సంగతి తలిదండ్రు లాలోచింపసాగిరి. వరునిఁ జూచిపోవుటకుఁ బలువురు వీరియింటికి వచ్చుచుఁ బోవుచుందురు. ఇట్లు వచ్చెడివారి కాగృహమున సాధారణముగ సర్పదర్శన మగుచుండెను. "అది మాపెంపుడు పామే లెండి! మిమ్మునేమియుఁ జేయదు." అని వారి కింటివారు సమాధానము చెప్పి, వారిసందియములఁ దీర్పఁజూతురు. కాని సర్పదర్శనము దుశ్శకునమని కొందఱును, పాము లింటఁదిరుగాడుచుండువారితో వియ్యమందఁ గూడదని మఱికొందఱును, మనస్సున నూహించి, వచ్చినదారినే పోవుచుందురు. కాబట్టి యెంతకాలమునకును పెద్దపిల్లవానికిఁ బెండ్లి కాలేదు. జ్యేష్ఠకుమారుని మాటయె యిటులైనపుడు, ఎదుగుచున్న తక్కినపుత్త్రులకును పుత్త్రికలకును నిఁక వివాహసంబంధము లెట్లు సమకూరునా యని తలిదండ్రులు దిగులుపడ సాగిరి.

ఆపద్ధర్మమను వ్యాజమున వివాహవిషయముల నెట్టి యకార్యములు చేయుటకును మనదేశమునఁ బలువురు వెనుదీయకున్నారు. ఒకరాత్రి గృహిణీగృహస్థులు, చాలఁబ్రొద్దు పోవువఱకును తమకుమారుని వివాహమును గుఱించి సంభాషించుకొనిరి. తుద కిల్లాలు, కంటఁదడిపెట్టికొని, పతిచెప్పినమాటలకుఁ దల యూఁచెను.

మఱునాఁటియుదయమున గృహిణి పడక నుండి లేచి, కన్నీరుమున్నీరుగ నేడ్చి, యింటిపనులు నెఱవేర్చుకొనుచుండెను. కొంతసేపటికిఁ బాలదాలినుండి పెద్దధ్వని వినఁబడెను. దుర్వాసన వెడలెను. గృహయజమానురాలంతమూర్ఛిల్లి పడిపోయెను. వేగమె యందఱు వచ్చి, చల్లనినీరు మోమునఁజల్లి యామె మూర్ఛను దెలిపిరి. ఆమె యంతట సైగ చేయఁగా వారు పాలదాలినిఁ బెల్లగించి, చూచిరి. అందు, తనపైఁ బేర్చిన పిడకలంటుకొనుటవలనఁ దప్పించుకొని పోవుటకు వలను పడక కొట్టుకొనుచుండు నొకసర్పము గానఁబడెను! దానినపుడు వారు వెలికిఁ దీసిరి. తల్లి మీఁదఁగల యపారప్రేమచేత, నాగరాజంతట సగముకాలిపోయిన తనశరీరమును మెల్లఁగ నీడ్చుకొనుచువచ్చి యామెపాదముల నంటి ప్రాణములు విడిచెను!

ఆదిన మాగృహము వారందఱిరోదన ధ్వనులతోను మాఱుమ్రోఁగెను. ప్రమాదమున ననలమున కాహుతియైన తన సర్పకుమారునికి యజమానుఁడు రెండవమాఱు దహనసంస్కారము గావించెను. మొట్టమొదటిదినములలో వారందఱికిని దుఃఖము దుర్భరముగ నుండినను, నానాఁటఁ శాంతిల్లెను. తల్లిమాత్రము పుత్త్రశోకము నెన్నఁడును మఱవలేకుండెను. ఆమె కన్నులయెదుటఁ బ్రియపుత్త్రుఁడు నాగరాజు సదా తాండవమాడుచున్నటులుండును. రాత్రులు పాఁప జేనినిగుఱించియే యామెకుఁ గలలువచ్చుచుండును. పుత్త్రఘాతుకురాలనని వగచివగచి,

దరిలేని సంతాపానలమునఁ గనలికనలి, యాకాంత యంతఁ గనులు మూసికొనెను. ఇంకఁ గొమరుని మృతిదినమునుండియు నేత్రపాటవము తప్పిన జనకుఁడు తన మహాపాతకమునకుఁ బరితపించి, యాఱునెలలలోన కాలగతినొందెను. చావు లొకటికి రెండుమూఁడయ్యెనే యని వారందఱు మిగుల శోకించిరి.

ఒకరిద్దఱిచావులతో నెన్నఁడు నీప్రపంచనాటక మంతమొందునది గాదు. ఇట్టి విడ్డూరములు జరిగినను, జగతీచక్ర మెప్పటివలె తిరుగుచుండెను. ఆ కుటుంబములో నుండువారికి మాత్రము, తాముకోలుపోయిన సర్పరాజును గుఱించి యెప్పుడును మఱపు రాకుండెను. ఇప్పుడు వారందఱును పెద్దవారలై, వివాహములు చేసికొని, కుటుంబ వ్యాపారములు నెఱవేర్చుకొనుచుండిరి. ఏలొకో కాని యావంశములోని వారికెవ్వరికిని సంతతిమాత్రము లేకుండెను! కొందఱు మహనీయులయాలోచన చొప్పున నంతట వారు, తమసొంతసొమ్ముతో నాగ్రామమున సుబ్రహ్మణేశ్వరుని కొకదేవళము గట్టించి, అది శాశ్వతముగ జరుగుటకై కొంత భూదానముఁ జేసిరి. తమ సంతతివారి కాదేవుని పేరు పెట్టెదమని మ్రొక్కుకొనిరి. అప్పటినుండియు వారికుటుంబము తామరతంపరగ వర్ధిల్లఁజొచ్చెను!

పై వృత్తాంతము జరిగి యిప్పటి కిన్నూఱుసంవత్సరము లైనను, ఆవంశమువారి కది నిన్నమొన్న జరిగినదానివలెఁ దోఁచుచున్నది. ఆయింట నిప్పటికిని మొదటిపుత్త్రునకు, పుత్త్రికకును తప్పక నాగరాజుపేరులే నామధేయములు. సర్పపురివారి వంశమున నెచటఁ జూచినను సుబ్రహ్మణ్యనాగరాజులును, శేషమ్మ సుబ్బమ్మలునే! వారందఱికిని సుబ్రహ్మణ్యుఁడే యిలువేల్పు.

ఇంకొక సంగతికూడ నిటఁ జెప్పవలయును. సర్పపురివారిలో ననేకులకుఁ బాముమంత్రము బాగుగఁ దెలియును. వారి పూర్వికులలో నొక రీమంత్రప్రభావమువలనఁ దన సర్ప పరివారముతో దాడివెడలి, బలిష్ఠుఁడగు శత్త్రువు నొకని నోడించెను. ఆవంశములోని వా రిప్పటికిని సర్పమును గౌరవించుచు సర్పదష్టులగు వారిని మంత్రోచ్చారణము చేతను ప్రక్రియలచేతను రక్షించుచుందురు. వారెన్నఁడును పాములను జంపరు. సొరకాయ పొట్లకాయ మొదలగు కొన్ని శాకములు ముట్టక, మిక్కిలి నిష్ఠాపరులై యుందురు. వారికి గాయత్త్రికంటెను సర్పమంత్ర మెక్కువ యాదరణీయము. ఇటీవలవారిలో నొకరు కేరళదేశమునకుఁ బోయి, అచటఁ గొంతకాలము నివసించి, 'పాంబు మేక్కావు నంబూద్రి' యను మహనీయునివలనను, తదితర 'మలయాల' మంత్రవేత్తలవలనను, క్రొత్తక్రొత్త సర్పమంత్రములను నేర్చుకొని యింటికి వచ్చెను. సర్పదష్టులగువారి నీతఁడుచూడఁగనే వారిమేనిలోనికెక్కినవిషమును బోగొట్టి వారిని రక్షించుచున్నాఁడు. ఎవనినైనఁ బాము కఱచినయెడల, ఆవార్తయాయన కెవనిచేఁ గాని, తంత్త్రిమార్గమునఁగాని, వేగమే తెలియఁబఱుపవలయును. అదివిని యాయన, "నాగరాజా! విడిచిపో" యని ముమ్మాఱు ఉచ్చరించును. తాను గట్టు

కొనిన వస్త్రమునుండి యొకపేలిక చించి, దండగాఁ జేసి, యది వార్త తెచ్చినవాని మెడలో వేయును. అంతఁ గొనయూపిరియున్నను, రోగి లేచికూర్చుండును!

సర్పపురివారు కొన్నిసంవత్సరముల కొకసారి యందఱును తమగ్రామమునఁ గలిసికొని తమకులదేవతయగు నాగరాజుపేరట "సర్పశాంతి"యను గొప్పయుత్సవము చేయుదురు. ఆదినములలో బహిరంగముగఁ బూజలు పురస్కారములును జేయుటయేకాక వారందఱుఁదమగృహమున నర్ధరాత్రిసమయమున నాంతరంగికసభయొకటి జరుపుదురనియును, ఆసమయమునలోకమునందలి యురగశ్రేష్ఠములన్నియునచటికేతెంచి, వారితోఁ గలిసి, తాండవమాడి, సూర్యోదయమునకుఁబూర్వమే పాతాళమునందలి తమతమ యిరవులకుఁ దిరిగి చేరుననియును బ్రతీతికలదు!

---

# ఘా తు క ప్రి య

నోరి నరసింహ శాస్త్రి బి. ఏ., (సాహితీసమితిసభ్యుడు)

నీ కృపార్ద్రకటాక్షంబు నిర్దయాత్మ,
కఠిన దృక్సర్జనముకన్న కలుషతరము!
నీవచించు సుధాస్వాదు స్నేహవాక్కు
పరుషపాషాణభాషకు పటుతరంబు!

నీ చిరుతనవ్వ భ్రాంతి సంధించి యెదను
లేనిపోనియాశలు చిగురింపజేయు!
మంచు తొలగును శశి యుదయించితోచు
అంతలో నీముఖంబు హిమాద్రి యగును!

తీవ్రతృష్ణాతురుని మృగతృష్ణవోలె
చపల మత్స్యాంగనల నామిషంబు రీతి
నీసుషమ పేశలాకృతి నీ మృదూక్తి
బలిమి కర్షించి నాదుదర్పము హరించు!

అతితరామర్షమున కరం బందు నంత
వ్రేలబడు పాణి చైతన్యవిరహ మగుచు!
ఈషదుద్రేక మొంది నో రెత్తునంత
గళము స్తంభించు జిహ్వ నిశ్చలత గాంచు!

శాశ్వతవిసర్జనేచ్ఛమై సాగునంత
అడుగు కదలక దారుమై యట్టె నిలుచు!
ప్రాణఘాతుక యనుకొన్న ఫలిత మేమి!
ప్రాణనాయిక యని నోట వాక్కు వెడలు!